www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 డిసెంబర్ 2025
5
వైఎస్ఆర్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సభాభవన్‌లో సోమవారం నిర్వహించనున్నామని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీ పంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవ లను వినియోగించుకోవాలని డిఆర్ఒ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబం ధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రగాఢమైన దేశభక్తి కార్మిక వర్గానిదే

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్

సమావేశంలో మాట్లాడుతున్న జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడపఅర్బన్

బిజెపి దేశంలో విస్తృతమైన పేదరికాన్ని ఉత్పత్తి చేస్తుందని, ప్రగాఢమైన దేశభక్తి కార్మిక వర్గానిదే అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో సిఐటియు కడప జిల్లా కమిటీ విస్తత సమావేశం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సిఐటియు 18వ జాతీయ మహాసభలు విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి 2026, జనవరి 4వ తేదీ వరకు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని కార్మిక వర్గం వందలాది మంది విశాఖపట్నంలో ఈనెల 4న నిర్వహించే బహిరంగ సభకు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మిక వర్గం ప్రగాఢమైన దేశభక్తితో దేశ పురోగతికి ఒకవైపు శ్రమిస్తుంటే, రెండవ వైపు దేశంలో విస్తతమైన పేదరికాన్ని బిజెపి ప్రభుత్వం ఉత్పత్తి చేస్తుందని విమర్శించారు. బిజెపి పాలన ప్రజల హక్కులు, జీవనోపాధిని హరించి వేస్తోందని విమర్శించారు. మోడీ కేంద్ర కేబినెట్ ప్రజా రాజకీయ జీవితం నుంచి క్రమక్రమంగా ప్రక్కకు జరిగి, పార్లమెంటరీ అరాచక వాదాన్ని ప్రవేశపెడుతూ, ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా ఆడియన్స్ రూపంలో నియంతత్వ పద్ధతిలో బిల్లులు ప్రవేశపెట్టి చట్టాలు చేస్తోందని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం, గౌరవం ప్రజలకు లేకుండా చేస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వాలకు కార్మిక వర్గం ప్రజా పోరాటాలతో గుణపాఠం నేర్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి, జనసేన వైఖరులు బిజెపి అనుకూలమైనవేనని వ్యక్తులు మాత్రమే వేరని గుర్తు చేశారు. ప్రగాఢమైన దేశభక్తి కార్మిక వర్గానికి సొంతమని ఆయన పునరుద్ఘాటించారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ మహాసభల విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రచారం విస్తృతంగా చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి, సిఐటియు జిల్లా కార్యదర్శులు కే.సత్యనారాయణ, ఎన్.భైరవ ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సాల్మన్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు చంద్రారెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుల రవి ప్రకాష్, సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శన

సిఐటియు అఖిలభారత మహాభలు జయప్రదం చేయాలని కడప నగరంలో ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శనలు నిర్వహించారు. మహాసభలకు సంఘీభావం తెలిపారు. తమ కళా ప్రదర్శనలతో సిఐటియు అఖిలభారత మహాసభల ప్రధాన్యత, విజయవంతానికి చేయాల్సిన సహాయ, సహకారాలపై న్యాటరూపంలో చైతన్య పరచారు. రాబోయే రెండు రోజుల్లో మరింత ప్రచారానికి సిద్ధమవుతున్నారు. కళారూపాలను ప్రదర్శించి కార్మి కులను, కర్షకులను కూడగట్టి విశాఖలో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని పెద్దఎత్తున ప్రచారం చేయనున్నారు. యుటిఎఫ్ భవన్‌లో సిఐటియు జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇందులో ప్రజానాట్యమండలి కళాకారులు తమ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కడప కన్వీనర్ సి.పి.వరలక్ష్మి మాట్లాడుతూ మహాసభల జయప్రదం కోసం తమ వంతు సహకారంగా కళా ప్రదర్శనలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఎన్ఎం జిల్లా ఉపాధ్యక్షులు సి.పి.రమణ, జిల్లా కమిటీ సభ్యులు డి.నరసింహులు, ప్రజా రచయిత చెన్నయ్య, సభ్యులు సాయి ప్రియా, విష్ణు ప్రియా, సుప్రియ, జశ్విత, భావన, చరిత, లక్ష్మి పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న ప్రజాన్యాటమండలి కళాకారులు

కమిషనర్ వైఖరిలో మార్పు రాకపోతే

పోరాటం తప్పదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఉపాధ్యాయులను యంత్రాలుగా భావిస్తూ, నిరంతరం బోధనేతర కార్యక్రమాలతో విద్యా బోధనకు దూరం చేస్తూ వేధింపులకు గురిచేయడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విద్యాశక్తి పేరుతో వందరోజుల ప్రణాళిక రూపొందించి, పండుగలు, సెలవు దినాలలో పనిచేయమనడం, పదవ తరగతి విద్యార్థులకు రోజూ పరీక్ష నిర్వహించి, అదే రోజు సాయంత్రానికల్లా మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఒత్తిడి చేయడం సరైనది కాదన్నారు. విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను వేధించడమే పనిగా పెట్టుకుని వెబెక్స్ మీటింగ్‌ల ద్వారా ఎంఇఒలు, డివైఇఒలు, డిఇఒలపై ఒత్తిడి తెచ్చి తీవ్ర పదజాలంతో దుర్భాషలాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముస్తాబు కార్యక్రమం పేరుతో ఉపాధ్యాయులపై మరింత ఒత్తిడి పెంచుతూ వేధింపులకు గురిచేయటం తగదన్నారు. విద్యార్థులను పాఠశాలకు సిద్ధపరిచి పంపే బాధ్యతల నుంచి తల్లిదండ్రులను మినహాయించి, ఉపాధ్యాయులకు ఆ బాధ్యత అప్పజెప్పడమేంటని ప్రశ్నించారు. విద్యార్థులకు సంబంధించిన బోధనను మినహాయించి మిగిలిన అన్ని పనులు ఉపాధ్యాయులే చేయాలనడం, తల్లిదండ్రుల కనీస బాధ్యతలను ఉపాధ్యాయులే నిర్వర్తించాలని కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడం సబబు కాదన్నారు. ఉపాధ్యాయుల పట్ల, విద్యా శాఖలో పనిచేస్తున్న అధికారుల పట్ల మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌ను తలదన్నేలా ప్రస్తుత కమిషనర్ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. విద్యాశాఖ కమిషనర్ దుందుడుకు వైఖరి పట్ల మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో గత ప్రభుత్వానికి జరిగిన నష్టమే ఈ ప్రభుత్వానికి తప్పక జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి విద్యారంగంలో జరుగుతున్న పరిణామాలపై చర్చించాలని కోరారు. విద్యా శాఖ కమిషనర్ వైఖరిలో మార్పు రాకపోతే భవిష్యత్తులో యుటిఎఫ్ పోరాటాలకు సిద్ధమవుతుందని తెలిపారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్.నాగార్జున రెడ్డి, జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, వివిధ విభాగాల కన్వీనర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

నిరసన తెలియజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఉద్యమకారులపై పీడీ యాక్టు దుర్మార్గం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పోరాడే అనకాపల్లి రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై పీడీయాక్టు పెట్టి జైలులో నిర్బంధించడం దుర్మార్గమని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి తెలిపారు. ఆదివారం చింతకొమ్మదిన్నెలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి యం అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పీడీ చట్టం కేసును వెంటనే ఉపసంహరించి విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై కృషి చేస్తున్న ఆయన పై తప్పుడు కేసులు బనాయించి చట్టవిరుద్ధంగా నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజల ప్రయోజనాలు, పేదల పక్షాన ప్రజాసామ్యబద్ధంగా, శాంతియుత పద్ధతుల్లో పోరాడుతున్న అప్పలరాజుపై దుర్బుద్ధితో అక్రమ పిడి చట్టం కేసు నమోదు చేశారని స్పష్టం అవుతుందని వాపోయారు. ప్రజల కోసం పనిచేస్తున్న అప్పలరాజుపై చట్టవిరుద్ధంగా బనాయించిన అక్రమ పీడీ చట్టం కేసును ఉపసంహరించి, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, మండల రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిన్న సిద్దయ్య, శ్రీనివాసులు రెడ్డి, రైతు నాయకులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల సాధనకు పోరాడుదాం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల : వికలాంగుల హక్కుల సాధన కోసం అందరూ కలిసి కట్టుగా పోరాడుదామని, అందుకు మాలమహానాడు వెన్నంటే ఉంటుందని మాల మహాడు నియోజక వర్గ అధ్యక్షులు జక్కుల కిరణ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా బద్వేల్ పట్టణంలోని మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో వికలాంగుల సదస్సుకు వికలాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ఓబులేసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు వికలాంగులను ఓటు బ్యాంకుగానే వాడుకుని వదిలేసున్నాయని చెప్పారు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. వికలాంగుల జీవనోపాధికి, వారి మనుగడకు ప్రోత్సాహాలు కల్పించాలని కోరారు. అనంరం 200 మంది వికలాంగులకు మాలమహానాడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య, జాతీయ మహిళా అధ్యక్షులు మంచా నాగమల్లేశ్వరి , కడప జిల్లా అధ్యక్షులు జస్టిస్ అది భాస్కర్, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'సీమ' జానపదంలో మేటి పరిశోధకుడు 'పేటశ్రీ'

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాయలసీమ జానపద పరిశోధనలో అనేక అంశాలను వెలుగులోకి తీసుకురావడమేగాక, విద్యార్థులచే పరిశోధనలు చేయించిన మేటి పరిశోధకులు ఆచార్య పేట శ్రీనివాసరెడ్డి అని మైదుకూరు తెలుగు అధ్యాపకులు డాక్టర్.కోడూరు జయప్రకాష్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' 150వ సదస్సులో భాగంగా 'ఆచార్య పేట శ్రీనివాసరెడ్డి జీవితం–సాహిత్యం' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. మైదుకూరు మేధా జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ కోడూరు జయప్రకాష్ వక్తగా విచ్చేశారు. తన ప్రసంగంలో ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి (పేటశ్రీ) కథారచయితగా, జానపద పరిశోధకులుగా, విమర్శకులుగా తనదైన శైలిలో సాహితీ వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారన్నారు. విద్యాభ్యాసమంతా తిరుపతిలోనే సాగిందని చెప్పారు. 1992లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని తెలుగు అధ్యయనశాఖలో సహాయ ఆచార్యులుగా చేరి 2007లో ఆచార్యులుగా ఉద్యోగోన్నతి పొందారన్నారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త డాక్టర్ కోడూరు జయప్రకాశ్‌ను సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, సిబ్బంది, ఎస్. సుబ్బరాయుడు, కొత్తపల్లె రామాంజనేయులురెడ్డి, కృష్ణానందం, కందిమళ్ల రాజారెడ్డి కలసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రసాదు, చంద్రశేఖరరెడ్డి, శ్యామసుందర్ రెడ్డి, ముడియం కిశోర్, కుమార్, నాగిరెడ్డి రఘునాథ రెడ్డి, మల్లేష్, దక్షిణామూర్తి, లక్ష్మిరెడ్డి, రమమూర్తి పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డిపై అసత్య ప్రచారం ఆపాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న మన్సూర్ అలీఖాన్

కడప నగరంలో స్వచ్ఛ కడప – మన కడప పర్యటనలో భాగంగా పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి పర్యటిస్తూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులతో సరదాగా మాట్లాడే మాటలలో తప్పుడు అర్థాలను వెతికి శ్రీనివాస రెడ్డిపై వైసిపి నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని ఆ పార్టీ నగర అధ్యక్షులు పఠాన్ మన్సూర్ అలీ ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ, అన్యాయంగా డబ్బులు దందా చేస్తున్నారంటూ పూర్తి వీడియో చూపకుండా వీడియోని కట్ చేసి వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా చేస్తున్నటువంటి అసత్యపు ప్రచారాలను తిప్పి కొడుతున్నట్లు తెలిపారు. సిసి కెమెరాల ఏర్పాటుకు విరాళాల రూపంలో ఎంత వచ్చిన పర్వాలేదని, మిగతా డబ్బు తన సొంత నిధులతో కేటాయిస్తానని శ్రీనివాసరెడ్డి మాట ఇచ్చారని తెలిపారు. దుష్ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులకు తగ్గిన బుద్ధి, గుణపాఠం ప్రజలు త్వరలోనే చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో నగర ప్రధాన కార్యదర్శి ముక్కర సుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్ హౌస్ చైర్మన్ శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బోనం శిలాస్, వెంకటేష్ ఆచారి, సుబ్బరాయుడు, 30వ డివిజన్ టిడిపి ఇంచార్జ్ జియావుద్దీన్,41 డివిజన్ ఇంచార్జ్ అఫ్జల్, 7 వ డివిజన్ ఇంచార్జ్ వెంకటరమణ, టిడిపి కార్యకర్తలు తోసిఫ్, హుస్సేన్ పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వై.ఎస్. రాజారెడ్డి ఎసి స్టేడియంలో అండర్ –12 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు విశేష స్పందన లభించింది. ఎంపికలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్, ఎసిఎ సౌత్ జోన్ కన్వీనర్ సంజయ్ కుమార్‌రెడ్డి, కాజా మొహిద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్– 12 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలకు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. వీరిలో మంచి ప్రతిభ కనబరిచిన 80 మందిని ప్రాబబుల్స్ మ్యాచ్‌లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రాబబుల్స్ మ్యాచ్‌లలో విశేష ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. జిల్లా జట్టు ఎంపికలకు సెలక్టర్లుగా శ్రీకాంత్ రెడ్డి, అశోక్ వ్యవహరించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : మండలం లోని ఇప్పెంట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భూమి సారవంతం కావడానికి ఘన జీవామృతం, మొక్కలకు పోషకాలు, తెగుళ్ల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో బయో రిసోర్స్ సెంటర్ కృష్ణయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందుతున్న సిబ్బంది

బిజెపి ముక్త్ భారత్ కోసం ఉద్యమించాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న విజయజ్యోతి

ఆనాటి కాంగ్రెస్ శ్రేణుల త్యాగం, ధైర్యం ఆయుధాలుగా చేసుకొని బిజెపి ముక్త్ భారత్ కోసం ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఉద్యమానికి సిద్ధపడాలని డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు 141వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత రాజీవ్ గాంధీ, వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలవేసి, మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల చేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశ దిక్సూచి కాంగ్రెస్ పార్టీ అన్నారు. బ్రిటిష్ బానిస సంకెళ్ళను విముక్తి చేసి, దేశానికి స్వాతంత్ర్యం సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను వక్రీకరిస్తోందని చెప్పారు. అభినవ భారతంలో దేశానికి మరో స్వాతంత్ర్యం రావాల్సి ఉంది అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - కడప

బహుమతులు అందుకుంటున్న విజేతలు

సిఎస్ఐ సెంట్రల్ చర్చ్ ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం సాయంత్రం సిఎస్.ఐ మైదానంలో మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతగా సుదేవి మునిరాజ్ జట్టు నిలిచింది. రన్నర్స్‌గా విజయ జాన్ జట్టు నిలిచింది. విజేతగా నిలిచిన వారికి బహుమతులను ఉమెన్స్ ఫెలోషిప్ అధ్యక్షులు, పాస్టర్ వి. పద్మజా విక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

1న ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు

శిల్పారామం ఎఒ ఎస్.కృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న ఎఒ కృష్ణప్రసాద్

నూతన సంవత్సరం పురస్కరించుకుని జనవరి 1న శిల్పారామంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎఒ ఎస్. కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఆదివారం శిల్పారామం ఎఒ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మన శిల్పా రామంలో నూతన సంవత్సర మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిరంతరాయంగా ప్రముఖ కళాకారులుతో సాం స్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. నగర ప్రజలు శిల్పారామం సందర్శించి కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. శిల్పా రామం సాంస్కృతిక కళావేదికపై పద్మాకర్ సహకారంతో కడప నగరానికి చెందిన సరేశ్వర డాన్స్ విద్యార్థులచే శాస్త్రీయ నృత్యాలు, పల్లె జానపదాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి ఎస్. కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.

నేడు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్

ప్రజాశక్తి - కడప

ఎపిఎస్‌పిడిసిఎల్ ప్రత్యేక కార్యక్రమం 'కారెంటోళ్ల జనబాట' లో భాగంగా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న ఉదయం 9:00 గంటల నుండి 10:00 గంటల వరకు డయల్ యువర్ ఎస్ ఇ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం ద్వారా వైఎస్ఆర్ కడప జిల్లా వినియోగదారులు నేరుగా ఎస్ఇకి ఫోన్ చేసి తమ విద్యుత్ సమస్యలను 085 62-242457 ద్వారా తెలియజేయవచ్చన్నారు. సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామాజిక సేవలను వేగవంతం చేస్తాం

దూదేకుల, నూర్‌బాషా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వి.ఖాదరయ్య

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

దూదేకుల నూర్‌బాషా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను వేగవంతం చేస్తామని దూదేకుల నూర్‌బాషా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వి ఖాదరయ్య, ప్రధాన కార్యదర్శి పి మస్తాన్ సాహెబ్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని ఎర్రముక్కపల్లె సమీపంలోని బాల వికాస్ స్కూల్ వెనుక భాగంలోని దూదేకుల భవన్లో వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూదేకుల నూర్‌బాషాత సంక్షేమానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి 60 మందికి పైగా తల్లిదండ్రులు హాజరు కావడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. అనంతరం దూదేకుల భవన్ కమిటీ అధ్యక్షులు ఆయిల్ మిల్ ఓబులేసు మాట్లాడుతూ దూదేకుల సంక్షేమానికి ముందు వరుసలో ఉంటానని తెలిపారు. దూదేకుల భవన కమిటీ ఇచ్చిన పిలుపునకు ఇంతటి రీతిలో స్పందన ఉంటుందని ఊహించలేదన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి వై అజ్మతుల్లా, ఆర్డబ్ల్యూఎస్ మస్తాన్, రిటైర్డ్ టీచర్ పి సుభాన్ , పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరిచయ వేదిక కార్యక్రమంలో నూర్‌బాషా సంఘం నాయకులు

ఇరిగేషన్ పనులు వేగవంతం చేస్తాం

రూ.5.43 కోట్లతో 128 పనులు
92 శాతం పింఛా పనులు పూర్తి
ఇరిగేషన్ ఎస్ఇ ఎం.అబ్దుస్ సమీ వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా నీటిపారుదలశాఖ పరిధిలోని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం. ఇందులో భాగంగా ఆపరేషన్ అండ్ మెయింటె నెన్స్ వర్క్స్, పింఛా ప్రాజెక్టు, రూ.5 కోట్లతో చేపట్టిన బుగ్గవంక పెండింగ్ పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించాం. వీటితోపాటు రూ.12 కోట్లతో పుట్లంపల్లి చెరువు ఆధునీకరణ, బుగ్గవంక ప్రాజెక్టు కాల్వ పెండింగ్ పనులు పరుగులు తీయించాల్సి ఉంది. ఇంతటితో ఆగకుండా పూర్ణోదయ, ఎస్ఎస్‌పి స్కీములకు ప్రతిపాదనలు పంపించాం. ఈఏడాది కడప, అన్నమయ్య జిల్లాలోని 1,392 చెరువు లకుగానూ 370 చెరువులను నింపడంతో జలకళను సంతరించుకున్నాయని పేర్కొంటున్న ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.అబ్దుస్‌సమీతో ముఖాముఖి...

ముఖా ముఖి..

ఇరిగేషన్ పరిధిలోని చెరువుల వివరాలు తెలపండి?

ఉమ్మడి కడప జిల్లా పరిధిలో 1,392 చెరువులున్నాయి. ఈ ఏడాది జిల్లాలో కురిసిన వర్షాలు, శ్రీశైలం వెనుకజలాల నుంచి తరలించిన కృష్ణాజలాల కారణంగా 370 చెరువులు పూర్తిస్థాయిలో నింపాం. దీంతో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, జిల్లా నీటి పారు దలశాఖ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా చెరువుల్లో జలకళను సంత రించుకున్నాయని ఘంటాపథంగా చెప్పవచ్చు.

పెండింగ్ ప్రాజెక్టుల గురించి స్పందించండి?

ఉమ్మడి జిల్లాలోని పింఛా ప్రాజెక్టు 92 శాతం మేరకు పునరుద్ధరణ పనులు చేపట్టాం. ఝరికోన ప్రాజెక్టు పెండింగ్ పనులు చేపట్టడంపై ప్రతిపాదనలు పంపించాం. రూ.ఐదు కోట్లతో బుగ్గవంక ఆధునికీకరణ పనులు చేపట్టాం. లైటింగ్ సిస్టమ్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉంది.

డిఎంఎఫ్ పనుల పురోగతిని వివరించండి?

కడప, కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగు, ఒంటిమిట్ట ప్రాంతాల్లోని 52 పనులకు రూ.9.98 కోట్లతోఆమోదం లభించింది. ఇందులో భాగంగా 34 పనులు పూర్తి చేశాం. ఐదు పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి.

ఒఅండ్ఎం పనుల ప్రోగ్రెస్ ఎలా ఉంది?

జిల్లానీటిపారుదలశాఖలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ స్కీ మ్ కింద 128 పనులు చేపట్టాం. ఇందులో 95 పనులు పూర్తి చే శాం. మరో 33 పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి.

బుగ్గవంక మందకొడితనంపై మీరేమంటారు?

బుగ్గవంక ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగుతున్న సంగతి వాస్తవమే. 2018, 2019 సంవత్సరాల్లో మేరకు బుగ్గవంక డ్యామ్ పనులు చేపట్టారు. అప్పట్లో 65 శాతం బుగ్గవంక డ్యామ్ పనులు పూర్తి చేశారు. మిగిలిన కాల్వల పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

ఎల్ఎస్‌పి పనుల తీరుతెన్నులపై స్పందించండి?

రూ.3.8 కోట్లతో లోయర్‌సగిలేరు ప్రాజెక్టు పనులు పూర్తి చేయడమైంది. గతేడాది కింద రూ.4.6 కోట్లతో గేట్ల ఏర్పాటుకు రివైజ్డ్ ప్రతిపాదనలు అందజేశాం. అనుమతి రాగానే పూర్తి చేయడం జరుగుతుంది.

పూర్ణోదయ, ఎన్ఎస్‌పి స్కీముల ప్రతిపాదనల పరిస్థితేమిటి?

జిల్లాలో పూర్ణోదయ స్కీమ్ కింద 187 చెరువుల పునరుద్ధరణ పనులకు ప్రతిపాదనలు పంపించాం. రిపేర్స్, రెక్టిఫికేషన్స్, రెనోవే షన్స్ స్కీమ్ కింద కేంద్రప్రభుత్వం 60 శాతం, రాష్ట్రప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చించాల్సి ఉంది. ఎన్ఎస్‌పి స్కీమ్ (నార్మల్ స్టేట్ ఫండ్స్) కింద రూ.12 కోట్లతో 27 పనులను ప్రతిపాదనలు అందజేశాం.

పాడా పనుల గురించి తెలపండి?

పాడా కింద 612 పనులు చేపట్టడమైంది. ఇందులో 330 పనులు పూర్తి చేశారు. వీటిపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. దీనిపై మాట్లాడడానికి ఏమీ లేదు.

ఫైనల్లో విజేతలుగా నిలిచిన డేంజర్ లెవెన్ టీమ్

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - ముద్దనూరు

నూతన సంవత్సరం పురస్కరించుకుని స్థానిక ఎల్ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చికి సంబంధించి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. జమ్మలమడుగు రహదారిలోని జగనన్న కాలనీ మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఎల్ఎమ్‌సి, జెఎంజె, డేంజర్ టీములకు చెందిన సీనియర్, జూనియర్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫైనల్లో జెఎమ్‌జె, డేంజర్ టీములు తలపడగా, డేంజర్ లెవెన్ విజయం సాధించి విన్నర్‌గా నిలిచారు. జెఎమ్‌జె లెవెన్ రన్నరప్‌గా నిలిచారు. అంపైర్లుగా అరుణ్, ప్రవీణ్ వ్యవహరించారు. కామెంటేటరుగా ప్రవీణ్‌కుమార్ వ్యవహరించారు. విజేతలకు జనవరి 1న రెవరెండ్ డ్యానియేల్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు ఏసుదాస్, యాకోబు, సువార్త, చంద్ర, కిరణ్ తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేత ఏసుదాస్ టీం

బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఏసుదాస్, అరుణ్ టీమ్ పాల్గొన్నారు. ఏసుదాస్ టీమ్ విజేతగా, అరుణ్ టీమ్ రన్నరప్‌గా నిలిచింది. కార్యక్రమంలో ఎల్ఎమ్ సి యూత్ పాల్గొన్నారు.

ఐక్యంగా సమస్యల్ని పరిష్కరించుకుందాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఐకమత్యంతోనే సమస్యల్ని పరిష్కరించుకుందామని పులివెందుల తాలూకా ఈడిగ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండయ్య గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని మిట్టమల్లేశ్వర స్వామి కల్యాణమండపంలో ఆదివారం గౌడ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండయ్య గౌడ్ మాట్లాడుతూ అయిదేళ్లుగా ఈడిగ గౌడ సంఘ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి సభ్యుడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గౌడ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. సంఘం తరపున పలు సేవా కార్యక్రమాలను 2026లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సంఘం తరపున కష్టపడిన చదివిన ఎవరైనా బీద కులస్తుల విద్యార్థులకు ఆర్థికసాయం చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సూర్యనారాయణ గౌడ్, గౌరవ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య గౌడ్, గౌరవ సలహాదారులు మురళి నాథ్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి ముని ప్రసాద్ గౌడ్, ప్రచార కార్యదర్శి జయకృష్ణ గౌడ్, మురళీమోహన్ గౌడ్, రంగా గౌడ్, సురేంద్ర గౌడ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పిహెచ్‌డి పట్టా పొందిన ప్రభావతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జెఎన్‌టియుఎ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిరవహిస్తున్న సి.ప్రభావతికి వెల్స్ విశ్వవిద్యాలయం చెన్నైలో పిహెచ్‌డి డిగ్రీ పూర్తి చేశారు. మొబైల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అప్లికేషన్ అనే అంశంపై డాక్టర్ ఎస్.మీరా మార్గదర్శకత్వంలో పరిశోధనల పూర్తి చేశారు. మొబైల్ ఐఓటీ నెట్‌వర్క్ శక్తి వినియోగాన్ని తగ్గిస్తాయి. పనితీరు మెరుగుపరిచేలా ఈ రీసెర్చ్ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ సి.ప్రభావతిని కళాశాల సిబ్బంది, అధ్యాపకులు అభినందిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

మటన్ దుకాణాలను పరిశీలిస్తున్న ఆప్ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా

మటన్ దుకాణాలపై నిఘా పెంచాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మటన్ దుకాణాలపై నిఘా పెంచి ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని అందేలా చూడాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా కోరారు. ఆదివారం వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో మాంసం దుకాణాలను రహమతుల్లా పరిశీలించారు. అయిదు వారాల నుంచి ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో మటన్ నాణ్యతను పరిశీలిస్తుట్లు చెప్పారు. ప్రతి వారం మటన్ దుకాణాలపై నిఘా పెట్టడంతో మేకలు, గొర్రెల మాంస విక్రయాన్ని నియత్రణ చేయగలుగుతున్నామన్నారు. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ మరింత పెంచితే మంచిదన్నారు. కొందరు రహస్యంగా గొర్ల మాంసాన్ని తెచ్చి విక్రయిస్తున్నారని, పంచాయతీ ఇఒ వారిపై దాడులు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. నాణ్యతలేని మాంసం విక్రయాలపై ఫిర్యాదులు చేసినా ఫలితంలేదనే ఆరోపణలున్నాయి.

ఆర్‌జెడికి సన్మానం

ప్రజాశక్తి -కడప అర్బన్

కడప పద్మశాలి భవన్‌లో పద్మశాలీయ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన కళాశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ గాజుల రవీంద్రనాథ్‌ను ఆదివారం దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి విజయకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్ఞాన శంకర్, మహిళా ఉపాధ్యక్షులు జనపాటి వెంకట లక్ష్మీ, కోశాధికారి అవ్వారు రమేష్, రిటైర్డ్ లెక్చరర్ మామిళ్ళ వెంకట సుబ్బయ్య,రిటైర్డ్ హెడ్మాస్టర్ బి.రామయ్య, ఆర్ట్ మాస్టర్ మంచా వెంకట సుబ్బయ్య, లెక్చరర్లు శోభన్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యా సంస్థల పునః ప్రారంభానికి సుముఖత

ప్రజాశక్తి- కడప అర్బన్

మాట్లాడుతున్న బండారు లోకనాథ్ స్వరూప్

కోవిడ్ -19 కారణంగా ఆర్థిక ఇబ్బందుల వల్ల శ్రీగోపాల స్వామి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడిచే విద్యా సంస్థలు మూతపడ్డాయని, వీటిని పునః ప్రారంభి ంచేందుకు నిర్ణయించామని సొసైటీ ఉపాధ్యక్షులు, ట్రెజరర్ బండారు లోకనాథ్ స్వరూప్ పేర్కొన్నారు. ఆదివారం సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై విద్యా సంస్థలు మూతపడ్డాయని పేర్కొన్నారు. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సొసైటీ ద్వారా విద్యాసంస్థలను ప్రారంభించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశంపై చర్చించామని తెలిపారు. తిరిగి ప్రారంభించేందుకు సొసైటీ సభ్యులు సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. సంస్థ కార్యకలాపాలు నిర్వహించేందుకు నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకొనుటకు తీర్మానించినట్లు పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షులుగా పి.ప్రభాకర్ రావు, ఉపాధ్యక్షులు, కోశాధికారిగా సి. హెచ్. అమూల్య, సెక్రటరీ, కరస్పాండెంట్ బి.లోకనాథ్ స్వరూప్, సభ్యులు సులోచన, సి.హెచ్.సురేష్, పి. క్రాంతి, కె కళ్యాణ కృష్ణ ఎన్నికైనట్లు చెప్పారు.

అధ్వానం..గ్రామీణ రహదారులు

నడవడానికి వీల్లేని నెర్రవాడ - నాగాయపల్లె రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నెర్రవాడ గ్రామం నుంచి నాగాయపల్లె గ్రామానికి వెళ్లే రహదారి చాలా అధ్వానంగా తయారైంది. ప్రభుత్వం గతంలో నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టింది. కొంతమంది నిర్మాణ పనులకు అభ్యంతరం చెప్పడంతో పనులు ఆగిపోయాయి. పంట పొలాలకు వెళ్లే ఈ దారిలో పూర్తిగా గుంతలు పడ్డాయి. ఈ మార్గాన నాగాయపల్లె, మొర్రాయపల్లె, సిద్దారెడ్డిపల్లె, సోమాపురం, బద్రిపల్లె గ్రామాల రైతులు పొలాలకు వెళ్లే అవకాశం ఉంది. రహదారి అధ్వానంగా ఉండడంతో రైతులు దిగుబడులు వచ్చిన సందర్భంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు ఉపయోగపడే ఈ రహదారిని పూర్తిస్థాయిలో బాగు చేయాలని కోరుతున్నారు. గత నెలలో అధిక వర్షాలకు రహదారి చాలా అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా నెర్రవాడ సమీపంలో బురద గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా వీల్లేకుండా ఉంది. ఈ మార్గాన మరమ్మతులు చేపడితే ప్రజలకు, రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం వరి పంట నూర్పిడి పనులు ప్రారంభం కావడంతో ధాన్యాన్ని తరలించడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలంలోనైనా ఈ రహదారిని బాగు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

అస్తవ్యస్తంగా అనుసంధాన రోడ్లు

కడప-కర్నూలు ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న అప్రోచ్ రోడ్లు పలుచోట్ల అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా మైదుకూరు వద్ద సర్వాయపల్లి మసీదు రోడ్డు నుండి హైవేకు వచ్చే ప్రదేశం చాలా అధ్వాన్నంగా ఉంది. రోడ్డు మొత్తం గుంతల మయంగా మారి ప్రయాణికులు హైవే పైకి రావాలంటే ఇబ్బందికరంగా ఉంది. గత నెలలో పడిన వర్షానికి ఈ మార్గం చాలా అధ్వానంగా తయారైంది. చాపాడు మండలంలోని ద్వారకా నగరం, సిద్ధారెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే అనుసంధాన రోడ్డు కూడా అస్తవ్యస్తంగా ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని హైవే రోడ్డు నిర్మించిన తర్వాత అనుసంధాన రోడ్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దువ్వూరు మండలం గుడిపాడు వద్ద రోడ్డు కూడా అధ్వానంగా ఉంది. అనుసంధాన రోడ్డు వద్ద లైటింగ్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది. మైదుకూరు- ప్రొద్దుటూరు ప్రధాన రహదారి నుంచి కడప-కర్నూలు ప్రధాన రహదారికి ఈ మధ్య కాలంలోనే అప్రోచ్ రోడ్లు వేశారు. గతంలో ఈ మార్గంలో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడేవారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రొద్దుటూరు రోడ్డు బ్రిడ్జి వద్ద సూచిక బోర్డు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కడప-కర్నూలు ప్రధాన రహదారి నుండి అప్రోచ్ రోడ్లు, సూచిక బోర్డులు, లైటింగ్ వ్యవస్థను అభివృద్ధి పరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జడ్జిగారి కొట్టాల వద్ద అధ్వానంగా ఉన్న అప్రోచ్ రోడ్డు

దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

కాంగ్రెస్ నేతలతో కలిసి నినాదాలు చేస్తున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

దేశ, రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని వేంపల్లెలో ఆదివారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ 1885 డిసెంబర్ 28న ఏవో హ్యూమ్ కన్వీనర్‌గా, ఉమేష్‌చంద్ర బెనర్జీ తొలి అధ్యక్షునిగా బాంబేలో 72 మంది ప్రతినిధులతో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భ వించిందన్నారు. నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక, లౌకిక, సామ్య వాద పార్టీగా విస్తరించిందని తెలిపారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, గాంధీ యిజం విజయం సాధించాలంటే అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావలసిన చారిత్రిక ఆవశ్యకత ఎంతైనా ఉంద న్నారు. ఇందుకోసం కాంగ్రెస్ శ్రేణులు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లి, చక్రాయపేట మండలాల అధ్యక్షులు బీగాల రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, బండారు వెంకటేశు, బద్రి, రాఘవయ్య, రవి, వేమయ్య, వినయ్, రమణ పాల్గొన్నారు.

చాపాటి రామ సుధాకర్‌రెడ్డి

చాపాడు : బ్రిటిష్ పరిపాలన నుంచి దేశ స్వాతంత్రం కోసం ఎన్నో పోరాటాలు చేసి దేశ బానిసత్వాన్ని విముక్తి చేయగలిగిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చాపాటి రామ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే మూడు దశల్లో కాంగ్రెస్ పార్టీ వైభ వోపేతంగా విస్తరించిన విషయం తెలి సిందేనన్నారు. మొదటి ప్రధానమంత్రి, ఆధునిక భారత ప్రజాస్వామ్య రూపశిల్పి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో ప్రసిద్ధిగాంచిన సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్యాసంస్థలు నిర్మించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అన్నారు. రాజ్యాంగ విలువలకు, సెక్యులర్ విధానాలకు, విశ్వసనీయతకు ప్రతీక కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు.

10న తిరుపతిలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర మహాసభలు

పోస్టర్స్‌ను విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

బ్యాంకుల్లో వేల కోట్ల రుణాలు తీసుకుని ఎగవేసిన వారంతా దేశభక్తులుగా, రాజ్యాంగం హక్కుల కోసం పోరాడే వారంతా అర్బన్ నక్సలైట్లనే ముద్ర వేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా గొంతుకలను నొక్కేస్తున్నాయని పౌర ప్రజాస్వామ్యకు హక్కుల సంఘాలు నేతలు విమర్శించారు. స్థానిక సృజన సామాజిక వేదిక కార్యాలయంలో ఆదివారం వారు జనవరి 10న తిరుపతిలో జరిగే పౌరహక్కుల సంఘం 20వ రాష్ట్ర మహాసభల పోస్టర్స్‌ను ప్రజాసంఘాల నేతల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసమ్మతిధిక్కారమనేవి ప్రజాస్వామ్య సంస్కృతిలో భాగమన్నారు. కానీ కేంద్రంలోని బిజెపి ఫాసిస్టు పాలకులకు ఇవి ఎంత మాత్రం గిట్టవని, అందుకే ప్రజాస్వామ్య వాదులను నక్సలైట్లు, టెర్రరిస్టులని ముద్ర వేసి దేశంలో అనేక చోట్ల పెరుగుతున్న అసమ్మతినిధిక్కార భావనలను క్రూరంగా అణచివేస్తున్నారనారు. భారత పౌరుల పౌరసత్వాన్ని ప్రశ్నించే వారి ఓటు హక్కులను తొలగించి, వారిని పరాయి పౌరులుగా మార్చే విధానాన్ని ఎన్నికల సంఘంచే అమలు చేస్తున్నారన్నారు. విద్వేష రాజకీయాలు సాగిస్తున్న కేంద్ర పాలకులు తీరును ప్రజాస్వామిక వాదులు అందరూ ప్రశ్నించాలన్నారు. పౌర హక్కుల సంఘం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గత 50 ఏళ్లుగా ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొంటూ త్యాగాలను చేస్తోందన్నారు. నేటి పరిస్థితుల్లో పౌరహక్కుల ఉద్యమాన్ని ప్రజాసంఘాలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు లెక్చరర్ సురేష్ బాబు, దళిత సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మురళి, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి రాజేష్, సిఎంఎస్ పద్మ, విరసం వరలక్ష్మి, విద్యావంతుల వేదిక ఎస్పీ మహమూద్, పీకేఎస్ శ్రీనివాసులురెడ్డి, నాగేంద్ర, బిఎన్ఎస్ జై చంద్ర, వెంకటరెడ్డి, మహిళా శక్తి వడ్ల లక్ష్మీదేవి, ఆర్వీఎస్ హరిత పాల్గొన్నారు.

వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రాజుపాలెంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామంలో ఇంటింటికి తిరిగి రోడ్డుపై వాహనాల్లో ప్రయాణించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రధాన మార్గంలో వస్తున్న ప్రయాణికులను ఆపి హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తూ.. మన శరీరంలో ఎక్కడ గాయమైనా ఫర్వాలేదని, తలకు దెబ్బ తగిలితే పరిస్థితి విషమంగా మారుతుందని తెలిపారు. హెల్మెట్ ధరించాల్సిన అవసరం గురించి వివరించారు. బైక్‌లో ముగ్గురు వెళ్లరాదన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. హెల్మెట్ ధరించి వచ్చిన వారిని ఆపి అభినందించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సిద్దయ్య ప్రయాణికులు, వాహనదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పర్లపాడు గౌరీశంకర్, మౌనయ ఆచారి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోంది : బిటెక్ రవి

సమావేశంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని కూటమి ప్రభుత్వం నెరవేస్తోందని టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన జడ్పిటిసి ఎన్నికల్లో ఎర్రబల్లె చెరువుకు నీళ్లు నింపుతామని చెప్పామని, ఈరోజు ఆ మాట నిలుపుకున్నామన్నారు. రైతులు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. నీటి సంఘాల ఎన్నికల్లో 32కు వందశాతం టిడిపినే కైవశం చేసు కుంటుందన్నారు. తుంగభద్ర హెచ్ఎల్‌సి చైర్మన్‌గా మారెడ్డి జోగిరెడ్డి ఎన్నిక య్యారన్నారు. వైసిపి నాయకులు పులివెందుల ప్రాంతంలో తాగునీటినీటి సమస్య ఉందని ఆర్డీవోకు వినతిపత్రం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. 40 ఏళ్ల నుంచి జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, ఛైర్మన్లు, ఎమ్మెల్యే, ఎంపీలు మీరే ఉండి నీటి సమస్య గురించి ఈరోజు మాట్లాడడం సమంజసం కాదన్నారు. ప్రతి ఇంటికి తాగునీటిని అందించడమే కూటమి ప్రభుత్వము లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. పులివెందులలో ఆగిపోయిన కొన్ని పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వాటిని కూడా పూర్తి చేస్తా మన్నారు. క్రికెట్ స్టేడియం పనులను కూడా త్వరితగగిన పూర్తి చేస్తా మన్నారు. అరటి రేట్లు తగ్గాయని వైసిపి వారు రాద్ధాంతం చేశారని, తాము కొద్ది రోజుల్లో రేట్లు పెరుగుతాయని చెప్పామన్నారు. ప్రసుతం అరటి ధర రూ.20,000 ఉందన్నారు. గత ప్రభుత్వంలో పాడా నిధులు రూ.కోట్లు దుర్వి నియోగం అయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో లింగాల మండల ఇన్‌ఛార్జి దేవిరెడ్డి సంజీవరెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గడ్డం అమర్నాథ్, అంబకపల్లె మునెయ్య పాల్గొన్నారు.

బిటెక్ రవిని సన్మానిస్తున్న మురళీమోహన్ యాదవ్

పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

టిడిపి కోసం కష్టపడిన వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి) పేర్కొన్నారు. టిడిపి కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి లోమడ మురళీ మోహన్ యాదవ్ ఆదివారం స్థానిక కార్యాలయంలో బిటెక్ రవిని కలిశారు. తనకు పార్టీలో పదవి రావడానికి సహకరించిన బీటెక్ రవికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతస్థాయిలో తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్, టిడిపి నాయకులు మారుతి యాదవ్ పాల్గొన్నారు.

వైద్యం చేస్తున్న డాక్టర్స్, రోగులకు సాయం చేస్తున్న జనసేన నాయకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని దిగువపట్నం కాలనీలో హోలిస్టిక్ హాస్పిటల్ వారిచే జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున, జనసేన నాయకులు ఆవుల వినయ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా నల్లంశెట్టి నాగార్జున మాట్లాడుతూ హోలిస్టిక్ హాస్పిటల్ వారిని అడిగిన వెంటనే అంగీకరించి ముందుకు వచ్చి నందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. దిగువపట్నం కాలనీలో చాలా మంది పేదలు ఉన్నారని, వారికి జనసేన పార్టీ నాయకులు ఆవుల వినయ్ ముందుకు వచ్చి వైద్య శిబిరం నిర్వహిస్తే బిపి, షుగర్, ఇతర చిన్నపాటి వైద్యం అందు తుందని ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 150 మంది వైద్య సేవలు పొం దారన్నారు. అవసరమైన మాత్రలు ఉచితంగా అందించామన్నారు. కార్యక్ర మంలో హోలిస్టిక్ హాస్పిటల్ గుండె సంబంధిత వైద్యులు రాజశేఖర్ వర్మ, ఆర్థో వైద్యులు హరీష్ బాబు, జనరల్ మెడిసిన్ డాక్టర్ నాగశేఖర్, జనరల్ ఎమర్జెన్సీ నిపుణులు సుహైల్ అహ్మద్, జనసేన కార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

సంతాపం వ్యక్తం చేస్తున్న నాయకులు

నరసింహ మృతి ఉద్యమానికి తీరనిలోటు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు ఎంఎస్‌పి సీనియర్ నాయకులు సుబ్బగాల్ల నరసింహులు మాదిగ మృతి ఉద్యమానికి తీరనిలోటని ఏపీ జెన్కో ఆర్టిపిపి ఎంఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.సాల్మన్ తెలిపారు. ఆదివారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో నరసింహులు సంతాప సభను ఏర్పాటు చేశారు. నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.సాల్మన్ మాట్లాడుతూ నరసింహులన్న మొదట బాంబుల నరసింహులుగా పేరు పొందినప్పటికీ తర్వాత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో దండోరా నాయకుడిగా ఉద్యమంలో కష్టపడి పని చేశారన్నారు. ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు మాట్లాడుతూ నరసింహులన్న ఎప్పుడు ఎవరు పిలిచినా పలికే వ్యక్తి అని, అన్ని వర్గాల ప్రజలకు చేరువై అందరికీ సాయం చేసేవారని కొనియాడారు. ఇప్పుడు ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు కె.ఎన్.రాజు మాట్లాడుతూ నరసింహులన్న కుటుంబానికి దండోరా అండగా ఉంటుందన్నారు. గత నెల 16న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ నరసింహులు ఇటీవల మృతి చెందారు. కార్యక్రమంలో రెండవ మున్సిపల్ వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, ఏపీ జెన్కో ఎంఇఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓ. నరసింహులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.చిన్నయ్య, ఎంఇఎఫ్ అధ్యక్షులు కె.బాల ఓబయ్య, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బిర్రు సంతోష్, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కలసపాడు

స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1988 నుండి 1993 మధ్యకాలంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుమారు నూరు మంది పూర్వ విద్యార్థులతో పాటు, అప్పటి ఉపాధ్యాయులైన బి.సిద్దయ్య టి.మాలకొండయ్య, ఎం.ఏసుదాసు, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.రమణయ్య హాజయ్యారు. కార్యక్రమంలో భాగంగా గురువులను మెయిన్ గేటు నుండి పూలు చల్లుతూ పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తదనంతరం వేదిక పైన భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. విద్యార్థులందరూ తమ బాల్యం మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ పరిచయం చేసుకున్నారు. తమ అభివృద్ధిలో ఉపాధ్యాయులు చేసిన కృషి, వారు నేర్పిన విద్యాబుద్ధులు, క్రమశిక్షణ ఎప్పటికీ మరువలేమన్నారు. పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ బ్యాచ్‌లోని విద్యార్థిని, విద్యార్థులు చదువులో బాగా రాణించి, ఉన్నత స్థానాలలో స్థిరపడినందుకు చాలా సంతోషిస్తున్నామన్నారు. 32ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. అనంతరం పాఠశాలకు సుమారు రూ. 50వేలు విలువచేసే బీరువాలు, మైక్రోస్కోప్ ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.రమణయ్య, సైన్స్ ఉపాధ్యాయులు జి.చెన్నారెడ్డి, డి.గురప్పకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట రామిరెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర నాయకుడు పి.రమణారెడ్డి, ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ బి.వి.రాజకిషోర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది కాకర్ల చెన్నారెడ్డి, ఉపాధ్యాయుడు కె.జె. ప్రవీణ్ కుమార్, పూర్వ విద్యార్థులు తిరుపాల్ రెడ్డి, లక్ష్మి ,సునంద,విజయలక్ష్మి రాజేశ్వరి, రోషిరెడ్డి, మార్కారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, మౌలాలి, ఓబయ్య, అబ్దుల్ ఖాదర్, బి.శేఖర్, నాయబ్ రసూల్, శ్రీనివాసులు, వెంకట సుబ్బారెడ్డి, రంగయ్య, బాలుడు, సదానంద్, సింగరయ్య, వెంకట్రామయ్య, జోసెఫ్ పాల్గొన్నారు.